# యాత్ర

ఎంత దూరం నడిచాడో అతను చెప్పలేడు. ఎప్పటి నుంచి నడుస్తున్నాడో కూడా గుర్తు లేదు. బరువెక్కిన కాళ్ళు కదలటం లేదు. చేతి కర్ర కింద పడవేసి ఇసకలో కూలబడ్డాడు.

అతని మనస్సులోని విషాదంలా విస్తరించి వుంది, ఎదురుగా సముద్రం. ఆతృతగా అటూ, ఇటూ చూసాడు నాయుడు బీచిలో వున్న వాళ్ళలో ఎవరైనా పలకరిస్తారేమోనని. ఎవరూ అతన్ని పల-కరించలేదు.

పగలు చచ్చిపోయింది. పశ్చిమాన పగలుని కాల్చిన చితి పూర్తిగా ఆరి పోయింది.

డాక్టర్ దగ్గరకు వెళ్ళాలనీ, కళ్ళద్దాలు మార్చుకోవాలని చాలా రోజుల నుంచి అనుకుంటున్నాడు.

డాక్టర్ దగ్గరకు తీసికెళతానని చెప్పాడు అబ్బాయి. పది రోజులు క్రితమే తీసికెళతానన్నాడు.

కానీ......

దగ్గరలో సుపరిచితమైన గంటలు సవ్వడి వినిపించింది. కొంత దూరంలో ఓ చిరుదీపం గాలిలో ఊగిసలాడుతూ వెలుగుతోంది.

అడుగు మీద అడుగు వేసి నడిచాడు నాయుడు. అక్కడ ఆగి వుంది ఒంటెద్దు బండి.

రంగు రంగుల తోరణాలతో అలంకృతమైన ఆ బండి అతనికి సుపరిచితమే.

ఆ ఊరి వీధులలో ఆ బండి తిరగటం చాలా సార్లు చూసాడు అతను. చూసినప్పుడల్లా అదో బండి కాదని అనిపించేది అతనికి. అది ఒక కదులుతున్న కుటుంబం. ఆ బండిలో వంట పాత్రలు వున్నాయి. మడత మంచాలు కూడా వున్నాయి.

ఎప్పుడో, ఏ ఊరి నించో బయలుదేరిన ఆ బండి ఇంకా యాత్ర సాగిస్తూనే వుంది.

ఆ బండి నడిపేది ఓ ముసలమ్మ. కనురెప్పలు కూడా నెరసిపోయిన ఆమె దగ్గర కూర్చొని వుంటాడు ఒక ముసలివాడు.

వాళ్ళ పెదవులు కదలటం చూస్తాడుగానీ, వాళ్ళ మాటలు ఎప్పుడూ వినలేదు.

వాళ్ళు ఏం మాట్లాడుతూ వుండేవారో? బహుశ గడచిపోయిన మంచి రోజుల గురించి, దాటిపోయిన తారురోడ్ల గురించి మాట్లాడుతూ వుండవచ్చు.

లేకపోతే ఊరు ఎప్పుడు చేరతారో అదే దానిగురించి మాట్లాడుతూ వుండవచ్చు.

కానీ వాళ్ళ మాటలు మాత్రం ఎప్పుడూ వినబడేవి కావు. ఈ రోజు అలా కాదు. మాటలు వినిపిస్తున్నాయి.

"రాముడు బాగా అలసిపోయాడే" కట్ట ఎండు గడ్డి తెచ్చి ఎద్దుకి వేస్తూ అన్నాడు ముసలాడు.

"నాకూ అదే భయంగా వుందండీ" ముసలమ్మ అంది. "ఇంకా చాలా దూరం వెళ్ళాలి. అంత దూరం వీడు మన బండి లాగగలడా?"

"ఏమో!" నిట్టూర్చాడు ముసలివాడు. నీరసంగా పడివున్న ఎద్దు వైపు చూసాడు. ఎద్దు వంటి నిండా వ్రణాలు కనిపిస్తున్నాయి. "మనమెప్పుడు ఊరు చేరతామో, ఎప్పుడు వీడికి మన మోత తప్పుతుందో?"

నాయుడికి బాధ వేసింది. వాళ్ళ వూరు ఎంత దూరమో? అంత వరకూ ఎద్దు బండిని లాగగలుగుతుందా? లాగలేకపోతే ...

లాగలేక పోతే తన బ్రతుకు లాగే అవుతుంది. నాయుడికి మరోసారి అతని కొడుకు గుర్తుకొచ్చాడు.

"నీకేంటిరా నాయుడు. మంచి పునాదే వేస్తున్నావు కదరా?"

అతని తోటి మేస్త్రీలు అంటూ వుండేవారు. "మరో ఆరేళ్ళలో మీ అబ్బాయి ఇంజనీర్ అయిపోతాడు కదరా?"

ఆ మాటకు నాయుడు మురిసిపోయేవాడు. నిజమే. కొడుకుని ఇంజనీర్‌ని చెయ్యాలి. వాడు తాపీ పుచ్చుకోకూడదు. అదే అతని ఆశ, జీవిత లక్ష్యం.

"వీడి మెడలో గంటలు కొన్ని ఊడిపోయాయి." రాముడి మెడను తడుముతూ అన్నాడు ముసిలివాడు. "కొత్తవి కొనాలి."

"గంటలొక్కటే నేంటండీ" ముసలమ్మ అంది. "వాడి కొమ్ము-లకి తొడుగులు చేయించాలి."

నాయుడికి ముచ్చట వేసింది. ఆ ఎద్దుని ఓ మనిషిలా బహూశా వారి పిల్లవాడిలా చూసుకుంటున్నారు, ఆ వృద్ధ దంపతులు.

అవును మరి! వాళ్ళ జీవితాన్ని ముందుకు నడిపించేది రాముడే కదా!

ఆ రోజు నాయుడికి బాగా గుర్తు. పనిలోకి వెళ్ళినప్పుడు కేరేజీ పట్టుకెళ్ళలేదు.

మధ్యాహ్నం కేరియర్ పట్టుకొచ్చిన కొడుకుని చూసి ఆశ్చర్యమే-సింది.

బడిలోకి వెళుతున్న పిల్లవాడి చేత కేరేజీ పంపించిన పెళ్ళాం మీద కోపం కూడా వచ్చింది.

అసలే అగ్ని కార్తెలు. ఆ ఎండలో నడిస్తే వాడేమైపోతాడు? అగ్నికార్తెలు కక్కిన ఎండ, సాయంత్రానికి తగ్గింది. కానీ ఇంటికి వెళ్ళినా, నాయుడికి కోపం తగ్గలేదు. పెళ్ళాం మీద మండిపడ్డాడు.

"ఓలమ్మ ఓలమ్మో! ఇదేం మాట!" తల బాదుకుంటూ ఏడ్చింది ఆమె. "కడుపు మాడుతుందేమోనని కేరేజీ పంపినాను. అదీ తప్పే?"
"వాడెవడనుకుంటున్నావ్?" నాయుడు కోపంగా అరిచాడు. "వాడు ఇంజినీరే వాడు మాలా మట్టిలో, ధూళిలో తిరగకూడదు."

"ఊరుకో నాయుడు" పక్క పాకల్లో నుంచి బయటకు వచ్చిన పైడితల్లి అన్నాడు. "నేను వింటూనేవున్నాను. ఇప్పుడు ఏమైందని ఈ గొడవ" బనీను జేబులోంచి ఓ లంకపొగాకు చుట్ట బయటకు తీసాడు. చుట్ట చివర నలిపి వెలిగించాడు. రెండు దమ్ములు లాగి అన్నాడు "నాయుడు నేనో మాట చెపుతా. మేడ కట్టేటప్పుడు పరంజి బాగా గట్టిగా కట్టుకోవాలి. అ పరంజిని నిలబెట్టే సరుగుడు రాటలు గట్టిగా వుండాలి. లేకపోతే పరంజి విరిగిపోతాది. మనం పడిపోతాం."

నాయుడు అతని వైపు చూస్తూ వుండిపోయాడు.

"నేను చెప్పేది ఒకటే" మళ్ళా రెండు దమ్ములు లాగి అన్నాడు.

"మనం నిలబడే పరంజిని నిలబెట్టే సరుగులు వీళ్ళు. వీళ్ళని బాధపెట్టకు పరంజి పడిపోతాది."

వాడు ఏ నోటితో అన్నాడోగానీ నిజంగానే పరంజి పడిపోయింది.

జీవిత భీమా భవనం మూడో అంతస్తు కడుతున్నప్పుడు పరంజి పడిపోయింది.

భీమా లేని నాయుడు బ్రతుకు భగ్గుమంది. నడుము జారిపోయిన నాయుడు నులక మంచం దిగలేదు. జీవితంలా చిల్లుపడిపోయిన పాక పైకప్పు నుంచి చొచ్చుకు వచ్చిన సూర్య కిరణాల వేడికి తట్టుకోలేక పోయాడు.

పుస్తకాల సంచీలు మోస్తూ రోడ్డు వారగా వెళుతున్న పిల్లల్ని చూస్తూ పడుకున్నాడు. ఇంక తన కొడుకు...

మరునాడు సంచీ మోసుకొని బయలుదేరాడు నాయుడి కొడుకు. కానీ ఆ సంచిలో వున్నవి పుస్తకాలు కావు.

మూల మట్టం, తాపీ, ఒడంబరం, సంచిలో పెట్టుకొని బయలు-దేరాడు వాడు.

చిల్లు పడిన పైకప్పు నుంచి ఎండ తగిలింది, వాన నీరు పడింది, చల్లని గాలి కూడా వేసింది.

ఊరు పెరిగిందట. ఊరిలో పెద్దపెద్ద కట్టడాలు వచ్చాయట. అతని కొడుకు చెప్పాడు.

అబ్బాయి పెద్ద మేస్త్రీ అయిపోయాడు. డబ్బు సంపాదిస్తున్నాడు. నాయుడికి మందులు ఇప్పిస్తున్నాడు.

కొద్ది కొద్దిగా నడువ గలిగాడు నాయుడు.

గతుకు రోడ్లలో, ఇరుక్కు పోయిన బ్రతుకు తారు రోడ్డు మీద కొచ్చింది.

కానీ తారు రోడ్డు మీద పరుగెత్తే జీవితాన్ని లారీ గుద్దేసింది. అక్కడికక్కడే చనిపోయాడు నాయుడు కొడుకు. ఏం చెయ్యాలో తోచలేదు నాయుడికి. బ్రతుకు ఈడ్చడమెలా?

ఎన్నో సాంఘిక, సంక్షేమ కార్యక్రమాలు అమలు పరుస్తున్నారని ఘోషిస్తున్న ప్రభుత్వం అతని లాంటి ముసలి వారికి ఇచ్చే భద్రత ఏమిటి?

ఆలోచించాడు నాయుడు.

ఆలోచిస్తూ కాలు ఈడ్చుకుంటూ నడిచాడు.

ఇంటికి వెళ్ళాలని అనిపించలేదు. బ్రతుకు మీద విరక్తి పుట్టింది.

ఆర్థిక భద్రత లేని బ్రతుకేమిటి?

నడిచి నడిచి ఎక్కడో పడిపోవాలనుకున్నాడు. ఇల్లు దగ్గరే కానీ వెళ్ళలేదు. ఇంటికి వెళితే కొడుకు గుర్తుకువస్తాడు. వాడు వాడిన తాపీ, మూలమట్టం కనిపిస్తాయి. అది అతనికి పిచ్చి ఎక్కిస్తుంది.

నడిచి అలసిపోయిన అతని కళ్ళు మూతలు పడ్డాయి.

ఎవరో గొల్లుమని ఏడవటం విని కళ్ళు తెరచాడు. రాత్రిని నడిపించిన తెల్ల ఎద్దు ఆకాశాన చచ్చి పడిపోయింది. తెల్ల మబ్బులనే జరా, నరలు నిండిపోయిన ఆకాశం కార్చిన కన్నీరు మంచు బిందువులుగా పడుతోంది.

గాబరాగా అటూ ఇటూ చూసాడు నాయుడు. కొద్ది దూరంలో కూర్చొని ఏడుస్తోంది ముసలమ్మ. పక్కనే పడివుంది చచ్చిపోయిన ఎద్దు.

ఇప్పుడెలా...

వాళ్ళు ఆ బండిని ఈడ్చుకుని ఊరు చేరటం ఎలా?

అతను ఆత్రుతతో చూసాడు.

ముసలివాడు ఎక్కడి నుంచో మెల్లగా ఏడుస్తూ వచ్చాడు.

సామాన్లన్నీ బండిలో సర్దేడు.

"పద" అతను ముసలమ్మ దగ్గర కొచ్చి అన్నాడు.

"ఎలా వెళతామండీ. మన రాముడు..." ఆమె గొల్లు మంది.

"ఒకరు పోతే బండి ఆగిపోతుందా. పిచ్చిదానా పద" తడబడుతున్న అడుగులు ముందుకు వేస్తూ అన్నడు ముసలివాడు. "నేను వున్నాను కదా లే..."

ముసలమ్మ బండి ఎక్కింది.

ఆ బండిని లాక్కుంటూ వెళ్ళిపోయాడు ముసలివాడు.

మరో నిముషం కూడా అక్కడ నిలబడలేదు నాయుడు, ఇంటివేపు నిడిచాడు.

* * *

*(ఆంధ్రజ్యోతి వారపత్రిక 3-1-92 సంచికలో ప్రచురితం)*